# ఛానెల్

# మిడ్‌నైట్

బెడ్రూమ్‌లో కొచ్చి ఫోమ్‌బెడ్‌పై వాలిపోయింది వైదేహి. రైన్‌సాంగ్‌లో నటించి వచ్చింది... ఆ అనుభూతులు ఇంకా ఆమె మదిలో పులకరింతలు రేపుతున్నాయి. ముఖ్యంగా దర్శకుడు ఫణీని తల్చుకుంటే.. మనసులో ఏదో గమ్మత్తైన ఫీలింగ్. రొమాంటిక్ సీన్స్‌ని ఆయన పిక్చరైజ్ చేసినట్టుగా ఎవరూ చేయలేరు.

హీరోయిన్‌లో ఏ అందముందో ఆయన ఎ(ెస)క్స్‌రే కళ్లు ఇట్టే పసిగట్టేస్తాయి. దాన్ని అందంగా ఎక్స్‌పోజ్ చేసి... హీరోయిన్‌ని నెంబర్‌వన్ అందలం ఎక్కిస్తాడు. ఎంతోమంది హీరోయిన్లు ఆయన సినిమాలో నటించాలని ఉవ్విళ్లూరు తారు ... కాని కొంతమందికే ఆ ఛాన్స్ లభిస్తుంది. వాళ్లు ఆకాశంలో ధగధగ మెరిసే చుక్కలవుతారు.

ఇందాకటి వానపాటలో ఆకులుండి రాలే చినుకులకి దోసిలిపట్టి... హీరోయిన్ జాకెట్లో ఒక్కో చినుకుగా వేసే సీనుని హీరోకి ఎక్స్‌ప్లెయిన్ చేస్తూ... జాకెట్లో పోసినపుడు.. ఆ నీళ్లు రెండు పర్వతాల మధ్య సాగే నదిలా ఒంపులు తిరుగుతూ... సాగిపోతూ... గిలిగింతలు పెడుతూ... ఓహ్, ఆ అనుభూతి అనుభవైక వేద్యం... అందుకే ఆయన శృంగార దర్శక చక్రవర్తి అయ్యాడు.

ఫణీ దర్శకత్వంలో తను నటిస్తున్న రెండో చిత్రమది. ఒకేసారి ఆయన దర్శకత్వంలో రెండు చిత్రాలు ... పరిశ్రమంతా నివ్వెరపోయింది ... ఆమె అదృష్టానికి కుళ్లుకుంది... తోటితారలైతే ఓపెన్‌గా సినీ పత్రికల్లో స్టేట్‌మెంట్లిచ్చారు ... 'మాలో లేనిది.. ఆమెలో ఏం కనిపించిందో ఆయనకి ...' అని.

ఫణీతో తన మొట్టమొదటి పరిచయాన్ని గుర్తు చేసుకుంటూ గతాన్ని నిద్రలో కలగంది.

☆☆☆

డిగ్రీ ఫైనలియర్ చేస్తున్న వైదేహి... కాలేజీ వార్షికోత్సవానికి 'వరూధిని' నృత్య రూపకం ప్రదర్శించింది. ఆమె నాట్యం.. కళ్లలో ఆమె పలికించిన భావాలు ఆహూతులయిన వాళ్లందరినీ ఆకట్టుకున్నాయి. నృత్యాన్ని దీక్షగా అభ్యసిస్తున్న ఆమె ఆశ మాపీగా కాకుండా అరంగేట్రంగా ఆ వేదికని మల్చుకుంది. నృత్యరూపకం పూర్తయ్యాక... తన్మయులైన వాళ్లందరూ క్షణకాలం తర్వాత స్పృహలో కొచ్చి కరతాళధ్వనులు చేశారు. ఆరోజు వార్షికోత్సవానికి విచ్చేసిన ముఖ్య అతిథి దర్శకుడు ఫణీ ఆమె అభినయానికి ముగ్ధుడయ్యాడు... కార్యక్రమం పూర్తయ్యాక ఆయన మాట్లాడవలసి వచ్చినపుడు వైదేహి గురించే మాట్లాడాడు.


"వైదేహిలో అందం ... అభినయం పోటీ పడుతున్నాయి ... ముఖ్యంగా ఆమె నృత్యం నన్ను మంత్రముగ్ధున్ని చేసింది. ఇలాంటి వాళ్ల అవసరం ఇపుడు చిత్ర పరిశ్రమకెంతో వుంది. టాలెంటెడ్ గాళ్స్ సంప్రదాయం.. చట్టుబండలు అంటూ ... మాటున దాక్కుంటుండబట్టే మనం హీరోయిన్లుగా తెలుగురాని... నటించడం చేతకాని అమ్మాయిల్ని బాలీవుడ్ నంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. మన తెలుగు పరిశ్రమ ఈ విషయంలో గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది ... వైదేహి సినిమాల్లోకి రావడానికి వాళ్లింట్లో వాళ్లు అంగీకరించి ప్రోత్సహిస్తే... నా తదుపరి చిత్రంలో హీరోయిన్‌ని చేస్తాను. 'తెలుగు సినిమాకి పదహారణాల తెలుగుపిల్లని ప్రెజెంట్ చేస్తాను' అన్నాడు అవిరామంగా మ్రోగుతున్న చప్పట్ల మధ్య.

ఆ విషయం అంతటితో సరి అనుకుంది.



# తెరపడిన జీవితం

ప్రతాప వెంకట సుబ్బారాయుడు




రెండ్రోజుల తర్వాత తమింటి ముందు కారాగింది. అందులోంచి హుందాగా దిగాడు ఫణీ.

ఆయన రాకని ఆ ఇంట్లో వాళ్లు నమ్మలేకపోతున్నారు. చిత్ర పరిశ్రమలో ఎవరెస్ట్‌ని అధిరోహించి... పరిశ్రమని శాసిస్తున్న డైరెక్టర్ ఫణీంద్ర తమింటికి రావడం ... ముమ్మాటికి కలే అనుకుంటున్నారు.

ఇంటిముందుకొచ్చి ''వైదేహీ...'' అన్నాడు.

''మా అమ్మాయే రండి...'' లోపలికి ఆహ్వానించి కూర్చోబెట్టాడు వెంకటాచలం... వైదేహి తండ్రి.

''అమ్మాయ్... వైదేహీ...'' వంటింటి వైపు చూస్తూ పిలిచాడు.

''మీ అమ్మాయి వైదేహి చక్కని రూపకం ప్రదర్శించింది... మీకు అభ్యంతరం లేకపోతే... ఆమెని సినిమాలకి ఇంట్రడ్యూస్ చేస్తాను... మంచి ఫ్యూచరుందామెకి'' అన్నాడు.

అప్పుడే ఆ గదిలోకి వచ్చిన వైదేహి రెండు చేతులు జోడించి ఫణీకి నమస్కరించింది... అప్పటిదాకా పనిలో నిమగ్నమయి వుండడం వలన ఆమె ముఖంపై స్వేద బిందువులు.. గులాబీ పువ్వుపై మంచు బిందువుల్లా వున్నాయి ... ఎక్కడికక్కడ తీర్చిదిద్దినట్టున్న అద్భుత కొలతల అవయవ సంపద... క్రీగంట నఖశిఖ పర్యంతం ఆమె అందాన్ని మేజిక్ చేయసాగాడు ఫణీంద్ర.

ఫణీ రాక ఆమెకెంతో ఆహ్లాదాన్ని కలిగించింది... 'ఆయన సినిమాలు ఎన్నో చూసింది... అన్నీ టీనేజ్‌ని కలవరపెట్టేవే...' ఆయన్నొక్కసారన్నా చూడగలనా? అనుకుంది... సినిమాలో ఆఫర్ ఇస్తానని ఇంటికొచ్చారు. అదృష్టం తలుపు తట్టడమంటే ఇదేనేమో? ఆమె మనసు మయూరమైంది.

''మా అమ్మాయి సినిమాల్లో నటించడం ఇష్టం లేదండి... చదువు పాడవుతుంది.. పైగా పెళ్లి కూడా సమస్య అవుతుంది...'' నెమ్మదిగా అన్నాడు.

''లేదండీ... మీరింకా పాత భావాల్తో వున్నారు. ఆడాళ్లు గుమ్మంచాటు నుండి మాట్లాడే రోజులు కావివి... స్త్రీలు అన్ని రంగాల్లో ముందంజ వేస్తూ ప్రపంచఖ్యాతి నార్జిస్తున్నారు. మిస్ యూనివర్స్... మిస్ వరల్డ్‌గా ఎంపికై ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకుంటున్నారు.. సినిమా అంటే గ్లామర్ ఫీల్డ్... డబ్బు... పేరు... పలుకుబడి... ఒకటేంటి? సాక్షాత్తు లక్ష్మీదేవి అవుతుంది. ఎంతోమంది నా డైరక్షన్‌లో నటించడానికి ఉత్సాహపడతారు... పెద్ద పెద్ద నిర్మాతల రికమెండేషన్స్ తీసుకొస్తారు... కాని నేను ఫ్రెషర్స్‌కి ప్రాధాన్యం ఇస్తాను. మంచి నటిగా వైదేహి ఎదుగుతుంది... నా నమ్మకం ఎప్పుడూ వమ్ముకాదు'' దృఢంగా అని లేచి నుంచున్నాడు వెళ్లడానికన్నట్టు.

వెంకటాచలం సమాధానమేం చెప్పలేదు.

''తొందరేం లేదు... నేను కృష్ణా ఒబెరాయ్ హోటల్‌లో రూమ్‌నెం 115 లో రెండు రోజులు వుంటాను. మీరు నిదానంగా ఆలోచించుకుని ఆ లోపల మీ నిర్ణయం నాకు చెప్పవచ్చు.... ఉంటాను వైదేహీ...'' అని వెళ్లిపోయాడు.

వెంకటాచలం ఒక పట్టాన వప్పుకోలేదు. అన్నం మాని... మారాం చేసి... వైదేహి ఒకరోజు గడిపాక... కూతురి కోసం తప్పనిసరై ఒప్పుకున్నాడు.

కూతుర్ని కృష్ణా ఒబెరాయ్‌కి తీసుకెళ్లాడు.

వైదేహిని సినిమాల్లో చేర్పించడానికి ఒప్పుకున్నందుకు వెంకటాచలాన్ని అభినందించి... ''వైదేహిని స్క్రీన్ టెస్ట్ చేయాలి... స్టూడియోకి వెళ్దాం పదండి'' అని కారులో స్టూడియోకి తీసుకెళ్లాడు.. మరుసటి రోజు ఆమెని తన చిత్రంలో హీరోయిన్‌గా కన్ఫర్మ్ చేసి... విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేసి...'' తెలుగు పరిశ్రమ నిరీక్షణ ఇన్నాళ్లకి ఫలించింది. పరిశ్రమకి వసంత మొచ్చింది. కాదు వైదేహి తీసుకొచ్చింది.. హీరోయిన్ల విషయంలో ఇహ మనం బాలీవుడ్ మీద ఆధారపడ వలసిన అవసరం లేదు... అంతేకాదు గత చరిత్ర లాగానే ఇవాళ్టి ఈ దక్షిణాది అమ్మాయి వైదేహి... బాలీవుడ్ నెం.1 సింహాసనాన్ని మరి కొద్ది కాలంలో అధిష్టించబోతోంది... గ్లామర్ పర్ఫార్మెన్స్ సమపాళ్లలో కలబోసుకున్న అరుదైన నటి మనకి లభించింది.., గివ్ ఎ బిగ్ హాండ్ టు హర్'' అన్నాడు.

అందరూ పెద్ద పెట్టున హర్షధ్వానాలు చేశారు.

''నా చిత్రంతో ఈమెచేత ఓనమాలు దిద్దిస్తున్నాను... మెగా ప్రొడ్యూసర్లందరూ ఈమెకి తమ చిత్రాల్లో అవకాశమిమ్మని రిక్వెస్ట్ చేస్తున్నాను...'' అంటూ ముగించాడు.

ఆమె మనసు మబ్బు పల్లకీ ఎక్కింది... కళ్లు ఆనంద భాష్పాలతో మసకబారాయి.

''మేడం మీరేమన్నా మాట్లాడతారా?'' మైక్ ముందు పెట్టి, తేనెటీగల్లా మూగారు విలేఖర్లు.

ఆమె గొంతు ఆనందంతో మూగబోయింది.

''కొత్త కదా... మాట్లాడ్డం ప్రాక్టీసు కావాలి... ఏం రాస్తారో పాజిటివ్‌గా రాసుకోండి... పద వైదేహి'' అని లేచాడు.

మొదటి చిత్రం రిలీజై కనకవర్షం కురిపించింది.

ఒక్కసారిగా తారాపథంలో తళుక్కున మెరిసింది. నెంబర్‌వన్ రేసులో పి. టి. ఉషని మించింది.

రెండో చిత్రం రెగ్యులర్ షూటింగ్ జరుగుతోంది... అందులోదే వానపాట.

☆ ☆ ☆

ఒకరోజు షాట్ తర్వాత వచ్చిన గ్యాప్‌లో ''వైదేహి... నీతో కొద్దిగా మాట్లాడాలి'' అన్నాడు.

''ఏంటండీ''

వాళ్లిద్దరూ నెక్స్ట్ షాట్ గురించి మాట్లాడుకుంటున్నారని ఎవరూ దగ్గరకి రావడం లేదు. పైగా డిస్కషన్‌లో వున్నప్పుడు ఆయన్ని డిస్టర్బ్ చేస్తే అపర దుర్వాసుడు అవుతాడు.. డిస్టర్బ్ చేసిన వాళ్ల నూకలు చిత్ర పరిశ్రమలో చెల్లిపోతాయి.

'నేను దర్శకుడ్ని కాకముందు... మేనత్త కూతుర్ని పెళ్లి చేసుకున్నాను. ఆ తర్వాత అదృష్టం బాగుండి అంచెలంచెలుగా ఎదుగుతూ ఈరోజు ఈ స్థాయికి

చేరుకున్నాను. మా ఆవిడకి చాదస్తం ఎక్కువ.. గయ్యాళితనం జాస్తి... నాకు హీరోయిన్స్ అందరితో సంబంధాలు అంటగట్టి రోజూ సాధిస్తూంటుంది.. శృంగార దర్శకుడిగా ఇంతపేరు గడించిన నేను... ఇంట్లో పొందే సంసార సుఖం శూన్యం... అందుకే ఆమెతో ఇహ వేగలేక నేను నిర్ణయానికి వచ్చాను... నువ్వు సినీతారగా ఇప్పుడిప్పుడే పైకొస్తున్నావు... భవిష్యత్తులో పెళ్లి అనేది నీకు సమస్య అవుతుంది... రేపు నువ్వు పరిశ్రమలో ఎవరినన్నా పెళ్లి చేసుకున్నా సుఖపడతావన్నది కల్ల... దానికి మాజీ తారల కథలే సాక్ష్యం... అందుకని...'' ఆగాడు.

కళ్లు పెద్దవి చేసుకుని చూస్తూ...''చెప్పండి'' అంది.

''అందుకని మా ఆవిడకి చట్ట ప్రకారం విడాకులిచ్చి నిన్ను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను.. నిన్ను పరిచయం చేసిన నేనే నీ జీవితానికి బంగారు బాట వేస్తాను. నీ అభివృద్ధిని ఎప్పటికీ అడ్డుకోను... ఏవంటావు?'' అన్నాడు.

'ఏవంటుంది? తనకోసం మొదటి పెళ్లానికి విడాకులిస్తానంటున్నాడు.. తనని ఆకాశ తారల్లో చందమామని చేస్తానంటున్నాడు... ఎక్కడో అనామకురాల్లా వుండాల్సిన దానికింత పేరు ప్రఖ్యాతులు తెచ్చాడు... ఇప్పుడు మనసులో స్థానమిస్తానంటున్నాడు.'

'ఇష్టమే' అన్నట్టు తల సిగ్గుతో దించుకుంది... బుగ్గలు అరుణిమదాల్చాయి.

''ఇప్పుడే నీ పెళ్లయినట్టు తెలిస్తే... కెరీర్ దెబ్బ తింటుంది... అందుకని రేపు వెంకటేశ్వరస్వామి గుడిలో తెల్లవారు జామున రహస్యంగా పెళ్లి చేసుకుందాం... జస్ట్ ఉంగరాలు మార్చుకుందాం... మంగళసూత్రం... అవీ అంటే విలేఖర్లు ఆవులించకుండానే పేగుల్లెక్ఖ పెట్టేస్తారు.. ఆ తర్వాత నిదానంగా బయటపడదాం ఏవంటావు?'' అన్నాడు.

తన వెల్ విషర్... మంచి చెబితే ఎందుకు వినదు. ఏనాటి బంధమో ఇది.. ఏ పూజ ఫలమో ఇది.


మరుసటిరోజు వెంకటేశ్వరస్వామి గుడిలో ఉంగరాలు మార్చుకుని... స్వామి సాక్షిగా ఒకటయ్యారు... మానవ మాత్రుడెవరూ ఆ కళ్యాణాన్ని చూడలేదు... అలా చూడకుండా ఫణీ మేనేజ్ చేశాడు.

ఆరోజు రాత్రి ఒక పేరొందిన హోటల్లో... ఇలకి దిగిన స్వర్గంలా వున్న రూంలో...

''చూడు... హనీ... ఈ హుక్స్ ఇలా కొద్దిగా పైట చాటు నుండి ఇలా కన్పడాలి... ఒక హుక్ విడిపోయి వుంటే మరీ మంచిది... యువతరం వెర్రెక్కిపోతుంది... చీర కుచ్చిళ్ళు కొద్దిగా బొడ్డు కిందికి ఇలా దిగాలి అంటూ అక్కడ చేయిపట్టి కుచ్చిళ్ళు విడదీశాడు... అతని చేతివేళ్లు నాభి చుట్టూ నాట్యమాడి ముందుకురికాయి. మరోచేయి కుచాగ్రాలని మీటి సుఖానుభూతుల స్వరాలు పలికిస్తున్నాయి. అంగాంగాల్లోకి అనుభూతులు ప్రవహించి.. చేతలై సుఖాన్నొందుతున్నాయి... శృంగార దృశ్యాలకి ప్రాణం పోసిన దర్శకుడు శృంగార పురుషుడు అవుతున్నాడు... ఆమె అందాన్ని బెడ్‌పై ఆరేసి... ఆమెపైకి ఒరిగాడు. పురుషుడిని ప్రకృతిలా తనలో ఐక్యం చేసుకోవడంలో అంత ఆనందం వుంటుందని ఆమెకి తెలియదు. పతాకావస్థకి చేరిన వైదేహి అతని ముఖాన్ని బలంగా గుండెల కదుముకుంది.

రెండో సినిమా రిలీజయ్యేవరకూ రోజూ హోటల్లో అమరసుఖాన్ని పొందాడు ఫణీ. జుంటి తేనెని ప్రతిరాత్రి గ్రోలుతూనే వున్నాడు. సినిమా రిలీజై ... ఫ్లాపయింది.

ఆకాశాన్నుండి అగాధంలోకి జారిపోయినట్టుగా అన్పించింది వైదేహికి.




ఫణీ అసలు కన్పించడం మానేశాడు. ఆమెతో సినిమాలు తీద్దామనుకున్న నిర్మాతలు ముఖం చాటేశారు.

ఒక స్టూడియోలో ఫణీంద్ర షూటింగ్ చేస్తున్నాడని తెలుసుకుని కలవడానికి వెళ్లింది.

ఎవరో వస్తే మాట్లాడ్డానికి వెళ్లాడని బాయ్ చెప్పడంతో... దూరంగా కనిపిస్తున్న పెద్ద మఱ్ఱిచెట్టు దగ్గరకి వెళ్లి వెయిట్ చేయసాగింది.

''నిన్ను షూటింగ్ స్పాట్‌కి రావద్దని ఎన్నిసార్లు చెప్పాను'' క్రోధంగా విన్పించింది ఫణీ గొంతు. చెట్టుకి అవతలి వైపు నుంచి.

''బాబు ఒక్కసారి మిమ్మల్ని చూపించమంటేనూ...''

''అంటే... వచ్చేయడమేనా? కాస్త ఇంగితజ్ఞాన ముండద్దూ... విలేఖర్లెవరన్నా చూస్తే ఇంకేవన్నా వుందా?... నువ్వు నా పెళ్లానివని ప్రపంచానికి తెలియాలా? ... దరిద్రపు ముం ... నా పక్కన నువ్వు అప్పలమ్మలా ఫుడ్యాలా ఫోటోల్లో ... ఎప్పుడో పెళ్లి చేసుకున్న పాపానికి తాడు ముక్కని ... తాళన్న సెంటిమెంటుతో దరిద్రంలా వెంటాడుతున్నావు... తన్ని తగలేసినా సిగ్గులేదు ... బయటికి ఒక్క గెంటు గెంటుదామంటే... పబ్లిక్‌లో పేరుపోతుంది... ఇలాంటి దరిద్రపు సిట్యుయేషన్ సినిమాల్లో కూడా వద్దు... వెళ్లు... ఎవరికంటా పడకుండా వెళ్లి ఇంట్లో ఓ మూల చావు'' అని కసురుకుని పెద్దపెద్ద అడుగులేసుకుంటూ షూటింగ్ స్పాట్ వైపు వెళ్లిపోయాడు.

వైదేహికి ఫణీ నైజం కొద్దికొద్దిగా అర్థమవసాగింది.

నోట్లో కొంగు దోపుకుని ఏడుపు నాపుకుంటూ కుర్రాన్ని ఈడ్చుకుంటూ వెళ్లిపోయిందావచ్చినామె.

''ఆ ఫణీంద్ర ఉత్త రోగ్ అమ్మా... కట్టుకున్నదాన్ని ప్రతిరోజూ కష్టపడతాడు ... నానా రకాలుగా హింసిస్తాడు... వీడ్ని నమ్మి ఒక హీరోయిన్ తన కెరీర్‌ని ... జీవితాన్ని నాశనం చేసుకుని కుక్కచావు చచ్చింది. ఇంకెంతమంది ఉసురు పోసుకుంటాడో వీడు...'' నిట్టూరుస్తూ చెప్పింది కేరెక్టర్ ఆర్టిస్టుగా పాతికేళ్ళ నుండి నటిస్తున్న ఒక ముసలావిడ వైదేహిని చూస్తూ...

వైదేహికి తనువూ.. మనసూ బండబారిపోయాయి.

ఆమెని అందంగా వాడుకున్నాడు... తన కెరీర్‌గ్రాఫ్‌లో ఒక మెట్టుని వేసుకున్నాడు ... ఫ్లడ్‌లైట్ల కాంతి ఆమె జీవితంలోకి ప్రసరించింది అనుకుంది. కాని ... లైటానికి.. లైటాఫ్‌కి మధ్య ఆమె జీవితం సమాప్తమయింది.

అలా ఆమె జీవితానికి తెరపడింది.